# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం వంటి అంశాలలో అంతర్జాతీయ సహకారం అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్"కు హాజరయ్యేందుకు భారత్ కు వచ్చిన పలు దేశాధినేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వేరు వేరుగా సమావేశమై చర్చలు జరిపారు.
- రియల్ టైమ్ సవాళ్ళకు ఏఐ పరిష్కారాలపై భారత్ ప్రధానంగా దృష్టి సారిస్తోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.
- రాజ్యసభలో వచ్చే ఏప్రిల్ తో ఖాళీ అవుతున్న 37 స్థానాలకు పోలింగ్ షెడ్యూల్ ను ఎన్నికల సంఘం విడుదల చేసింది.
- పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా భారత్, నెదర్లాండ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

=====================

సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం వంటి అంశాలలో అంతర్జాతీయ సహకారం అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. భారత్ సముద్ర వారసత్వం కలిగిన దేశమని, శతాబ్దాలుగా సముద్ర మార్గాలు వాణిజ్యానికి, సంస్కృతికి, భద్రతకు ప్రధాన ఆధారంగా నిలిచాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం సాగర జలాల్లో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో నౌకాదళ ప్రదర్శనలను రాష్ట్రపతి ఈరోజు సమీక్షించారు. అనతరం ప్రసంగిస్తూ.... "సురక్షిత సముద్రం – సమృద్ధి భారత్" అనే లక్ష్యంతో భారత నౌకాదళం నిరంతరం పని చేస్తోందన్నారు. ఈ ఫ్లీట్ రివ్యూ కేవలం శక్తి ప్రదర్శన మాత్రమే కాదని.. ఇది అంతర్జాతీయ స్నేహబంధాలకు ప్రతీక అని పేర్కొన్నారు. వివిధ దేశాల నౌకలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా "వసుధైవ కుటుంబకం" అనే భారతీయ తత్వాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నామని ద్రౌపది ముర్ము పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

=====================

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ కు హాజరయ్యేందుకు ప్రపంచ దేశాల నాయకులు భారత్ కు వచ్చారు. స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్, ఫిన్లాండ్ ప్రధాని యాంట్ పెట్టిరి ఆర్పో, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వూచిక్, ఎస్తోనియా అధ్యక్షుడు అలార్ కారిస్, క్రోయేషియా ప్రధానమంత్రి ఆండ్రేజ్ ప్లేన్ కోవిచ్, భూటాన్ ప్రధానమంత్రి డాషో షేరింగ్ టోబ్గే, కజకిస్తాన్ ప్రధానమంత్రి ఒల్గాస్ టెక్టెనోవ్, మారిషస్ ప్రధానమంత్రి రామగూలం ఈరోజు న్యూఢిల్లీ చేరుకున్నారు. స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈ ఉదయం హైదరాబాద్ హౌస్ వేదికగా సమావేశమై ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆర్థిక రంగం, డిజిటల్, సృజనాత్మక రంగం, ఆరోగ్యం, పర్యావరణ కార్యాచరణ, విద్య వంటి అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వూచిక్ కూడా నరేంద్ర మోదీతో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, కృత్రిమ మేథ, విద్య, వ్యవసాయం, పర్యాటక రంగం, పౌరుల మధ్య సంబంధాల బలోపేతం వంటి పలు అంశాలపై చర్చించారు. క్రోయేషియా ప్రధానమంత్రి ఆండ్రేజ్ ప్లేన్ కోవిచ్ తో సైతం నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ సమిట్ లో పాల్గొనేందుకు భారత్ కు వచ్చిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఈ ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై ఏఐ రంగంలో ప్రతిభావంతులైన భారతీయ విద్యార్థులు, నిపుణులకు గూగుల్ సంస్థ కల్పించగలిగే అవకాశాల గురించి చర్చించారు.

=====================

సమ్మిళిత కృత్రిమ మేథ ఎకో సిస్టమ్ ద్వారా భారీ పరిశ్రమలు, ఎం.ఎస్.ఎం.ఈ.లకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ లో భాగంగా ప్రపంచ దేశాల పారిశ్రామిక ప్రముఖులు, విద్యా వేత్తలు, విధానకర్తలు, సాంకేతిక నిపుణులు పాల్గొన్న ఒక సమావేశానికి అధ్యక్షత వహించిన అశ్విని వైష్ణవ్... తయారీ రంగం, ఇంజనీరింగ్, సాంకేతికత రంగాల్లో కృత్రిమ మేథ పరంగా దేశ ప్రాధాన్యతలను వివరించారు. ఏఐ ఫర్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీపై శ్వేత పత్ర ఇతివృత్తాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు. రియల్ టైమ్ సవాళ్ళకు ఏఐ పరిష్కారాలపై భారత్ ప్రధానంగా దృష్టి సారిస్తోందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

=====================

న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న `ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు`కు వస్తున్న భారీ స్పందన దృష్ట్యా గడువును ఫిబ్రవరి 21 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సందర్శకుల సౌలభ్యం కోసం ఎక్స్ పో సమయాన్ని రాత్రి 8 గంటల వరకు పెంచారు. విపరీతమైన రద్దీ, ప్రదర్శనకారుల విజ్ఞప్తి మేరకు ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే రేపటి ఎక్స్ పో కేవలం ప్రత్యేక ఆహ్వానితులకు పరిమితం చేశామని స్పష్టం చేసింది.

=====================

రాజ్యసభలో వచ్చే ఏప్రిల్ తో ఖాళీ అవుతున్న స్థానాలకు పోలింగ్ షెడ్యూల్ ను ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది. మార్చి 16న పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలు వెల్లడిస్తామని తెలిపింది. ఫిబ్రవరి 26న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి అదే రోజు నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని వెల్లడించింది. మార్చి 5 వరకూ నామినేషన్లు దాఖలు చేయవచ్చని, మార్చి 6న నామినేషన్ల పరిశీలన చేపట్టి ఉపసంహరణకు మార్చి 9ని

గడువుగా విధించింది. దేశంలోని మొత్తం 10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఈ షెడ్యూల్ విడుదలయ్యింది. అత్యధికంగా మహారాష్ట్రలో 7, తమిళనాడు 6, పశ్చిమబెంగాల్ 5, బీహార్ 5, ఒడిశా 4, ఛత్తీస్ గఢ్ లో 2 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి.

=====================

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రేపు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాల కార్యక్రమం "మిలాన్–2026" ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి నౌకాదళ ఉన్నతాధికారులతో సమావేశమై కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం నౌకాదళ స్థావరంలోని సముద్రిక ఆడిటోరియంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై దేశీయ, విదేశీ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పర్యటన అనంతరం రేపు సాయంత్రం ఢిల్లీకి తిరిగి పయనమవుతారు.

=====================

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా భారత్, నెదర్లాండ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 17 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఇక శ్రీలంకలోని కొలంబో వేదికగా నమీబియా, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ లో పాకిస్థాన్ 102 పరుగుల తేడాతో విజయం సాధించింది. అంతకుముందు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో అమెరికాపై దక్షిణాఫ్రికా జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

=====================

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు-2026ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు లాంఛనగా ప్రారంభిస్తారు. రేపు ఉదయం 9 గంటల 40 నిమిషాలకు ఏఐ ఇంపాక్ట్ సదస్సు-2026 ప్రారంభ కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. ప్రధానితో పాటుగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుల్ మాక్రాన్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఇతర అంతర్జాతీయ పారిశ్రామిక ప్రముఖులు ప్రసంగిస్తారు.

=====================

తీరప్రాంత పవనాలు దేశ ఇంధన భవిష్యత్‌కు బలమైన స్తంభంగా మారగలవని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "ఇండియా-యుకె ఆఫ్ షోర్ విండ్ టాస్క్‌ఫోర్స్" ప్రారంభోత్సవంలో ప్రహ్లాద్ జోషి మాట్లాడారు. విశ్వసనీయత, గ్రిడ్ స్థిరత్వం, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి దేశ పరివర్తనలో తీరప్రాంత పవనాలు వ్యూహాత్మక పాత్ర పోషిస్తాయని చెప్పారు. గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలలో 10 గిగావాట్ల ఆఫ్ షోర్ తరలింపు సామర్థ్యం కోసం ప్రసార ప్రణాళిక పూర్తయిందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 450 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 284 పాయింట్ల లాభంతో 83 వేల 734 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 93 పాయింట్లు లాభపడి 25 వేల 819 వద్ద ముగిసింది.

=====================

=====================